# నాన్నకో ఉత్తరం

"ఇయ్యాలయినా అమ్మికి జాబు రాసినావా లేదా?" వీధి చివరి నుండి మోసుకొచ్చిన మంచినీటి బిందెను పొయ్యి పక్కనే దించుతూ కొంచెం బిగ్గరగా ప్రశ్నించింది జానకి.

చాలాసేపట్నుండీ కుళాయి వద్ద పోరుకులాడినట్లుగా ఆమె జుట్టు చెరిగివుంది. నుదుట పట్టిన చెమటకి బొట్టు చెమరి వుంది.

తనంత బరువున్న బిందెను మోసుకురావడం వల్ల ఆయాసంతో ఆమెగుండె ఎగిసెగిసి పడ్తోంది. చీర చిరుగుల్ని మట్టసంగా లోపలికి మడుచుకొని పొయ్యి దగ్గర వొంగుతూ భర్తకేసి చూసిందామె.

అప్పుడే ఆఫీసు నుండి వచ్చి అరజగ్గు నీళ్ళతో మొహం, కాళ్ళు చేతులు కడిగేసుకుని పుస్తకాలు మందేసుకుని కూర్చుని వున్నాడు మనోహరం.

పొయ్యిలో రెండు తాటాకు మట్టలు బెట్టి మంట చేస్తూ పొద్దుట మిగిలి వున్న టీ నీళ్ళని వెచ్చజేస్తూ వుంది జానకి.

"ఇనపడ్డాదా?" పుల్లల్లాటి చేతుల్తో పొయ్యెక్కేస్తూనే రెట్టించింది.

"ఊ" కాడ విరిగిన కళ్ళజోడుని దారం కట్టి రిపేరు చేస్తూ జవాబిచ్చాడు. మనోహరం తప్పదన్నట్లుగా.

"దేనికి ఊ కొట్టినట్టు... ఇనపడ్డాదనా? జాబు రాశాననా?" విసుక్కుంది జానకి టీ నీళ్ళందిస్తూ.

కప్పందుకుంటూ భార్యకేసి చూశాడు మనోహరం. క్షణకాలం పాటు అతడు హృదయం చుట్టూ కట్టుకున్న ఇనుపగోడ ఒకింత సడలినట్టయింది. ఈ జానకి తమ పెళ్ళయిన కొత్తల్లో ఎంత అందంగా, నాజూగ్గా వుండేది మరెంత నాజూగ్గా మాట్లాడేది?

మకరందపు భారంతో మత్తెక్కి తూగుతోన్న పువ్వులా... అలా అలవోగ్గా... మరి యిప్పుడో.. జీవితపు అనేకానేక అనుభవాల తాకిడితో... అవమానాల పరంపరతో బరువెక్కి వడలిన పండుటాకులా వుంది.

బాధ్యతలు భావుకత్వాన్ని మింగేస్తాయా? ఆర్థిక ఇబ్బందులనేవి మనిషిలో లోపలి సహనాన్నే కాకుండా అందాన్ని, నాజూకుతనాన్ని, వీణలాంటి గొంతునీ హరించి వేస్తాయా? ఆరోగ్యం సరే ఎలాగూ హరించుకుపోయింది. గుంటలు పడ్డ జానకి కళ్ళనీ, ఎండుకుపోయి రొప్పుతూన్న జానకి గుండెల్ని పరికిస్తూ మౌనంగా కప్పు నోటి కానించాడు మనోహరం. అతడికి తెలుసు తనకి మాత్రమే సాయంత్రం పూట 'టీనీళ్ళు' జానక్కి వుండవు. అయినా అదేమీ గమనించనట్లుగా నటిస్తాడతడు.

పొయ్యి మీద ఎసరు పడేసి చాట్లో బియ్యం పోసుకుని తెచ్చి మనోహరం పక్కనే వాకిట్లో చతికిలబడింది జానకి. ఉన్న ఒకే ఒక గూడులాంటి గదిలోపల ఎప్పుడూ చీకటే. బిల్లు కట్టలేదని ఆ ఉన్న ఒక్కలైటూ పెరికేశారు కరెంటోళ్లు. అయితే జీవితంలోని చీకటితో పోల్చుకుంటే గదిలోపలి చీకటి పెద్ద నల్లగా ఏమీలేదు.

తలొంచుకుని బియ్యం ఏరుతోన్న జానకి కళ్లూ, గుండే కూడ బరువెక్కాయి. ఉద్వేగాన్ని ఆపుకోవడం కష్టంగా వుందామెకి. ఒక్కగానొక్క కూతురు వసంతని తమకు తిండి వుండి తిన్నా, లేక పస్తున్నా యెంతో గారాబంగా పెంచుకున్నారు. ఏదోలే గంతకు తగిన బొంత అనుకోకుండా తమకి మించినట్లుగానే యిచ్చి చేశారు. అబ్బాయి శ్రీరాములు ఒంగోల్లో టీచరుగా పన్చేస్తున్నాడు. ఆ సాంగ్యాలూ, ఈ సాంగ్యాలూ అంటూ అత్త బాగానే లాగింది. అయితే మాత్రం తమకది భారమయితే అయ్యుండొచ్చు గానీ, వాళ్ళ తాహతుకది ఎక్కువేమీ కాదు. ఏదో బాగానే వున్నారు. అట్టా జరిగి పోతావున్నది కదాని మొదులు పట్టించుకోకపోతే ఎట్టా? బిడ్డ గర్భంతో వుందని తెలిసి కూడా ఒక్కసారయినా పోయి రాలేకపోతేమి? అయిదో నెల్లో సారెబెట్టి ఘనంగా తీసుకురావల్సింది. అదేమంటే ట్రాన్స్‌ఫర్... ట్రాన్స్‌ఫర్... ట్రాన్స్‌ఫర్ మనం ఛస్తుంటే ఏందే సారె పెట్టేది... గీర పెట్టేది అంటూ కొట్టి పారేసె, ఇదంతా వాళ్ళకెట్టా తెలుస్తాయి. లేవలేని బిడ్డ అత్తా ఆడబిడ్డల కాడ ఎట్టుందో ఏమో, ముక్కు ఎగబీల్చుకుంటూ లోలోపలే గొణుక్కుంటూ వుంది జానకి.

జానకి గొణుగుడు చెవులకి స్పష్టంగా విన్పించకపోయినా ఆమె చెప్పేదేమిటో మనసు కయితే స్పష్టంగా తెలుస్తూనే వుంది మనోహరానికి.

కూతురుకి తొమ్మిదో నెల వచ్చింది. ఎప్పుడో అయిదో నెల్లోనే వెళ్ళి సారెబెట్టి తీసుకొచ్చి సీమంతం చేసుండాల్సింది. కానీ అదే సమయానికి తనకి ట్రాన్స్‌ఫరవడం, ఎంతో కాలంగా వుండిపోయిన చిట్టమూరు నుండి ఈ వూరు రావడం... కుటుంబాన్ని అటు నుండి యిటు తరలించడం యిదంతా శక్తికి మించిన భారమైపోయింది తనకి.

చిట్టమూర్లో రెండెకరాల నేలవుందనే అప్పట్లో చిట్టమూరు మండలమవగానే కావాలని పెద్దోళ్ళందరి కాళ్ళావేళ్ళా పడి బతిమాలుకుని అక్కడికి వేయించుకున్నాడు. కొన్నాళ్ళు బాగానే గడిచింది.

ఇంటిల్లిపాదీ అష్టకష్టం చేసి ఆ నేలలో చెనగ యేస్తే తొలినాళ్ళలో కొంత ఫర్వాలేదు అసలుకి అసలయినా అయ్యేది. ఆ తరువాత ఎండాకాలం నీళ్ళు లేక వానాకాలం వరదొచ్చేసి పంట చేతికొచ్చేదే కాదు. అధవా వచ్చినా ధర పలికేది కాదు. ధర ఎక్కువగా వున్నా దళారుల క్రింద నలిగిపోయేది. ఇట్టనే నలిగి నలిగి బతుకెళ్ళ మారుస్తా పదేళ్ళు తిరిగేటప్పటికి అమ్మేసిన ఒకటిన్నరెకరా పొలం పోగా మిగిలిన అరెకరాతో పాటు యిరవైవేల అప్పు మిగిలింది. ఇహన ఆ వూళ్లో వుండి కట్టెలమ్మ లేక మళ్ళీ ఆ పెద్దోళ్ళ కాళ్ళనే పట్టుకుని యిదిగో ఈ వూరు వచ్చేసాడు.

ప్రభుత్వం కూడ చిత్రమైందే అదేంటో కానీ... రెవిన్యూ ఇంజనీరింగు డిపార్ట్‌మెంటుల్లో వున్నట్లుగా పై ఆదాయాలు, ప్రమోషన్లూ ఈ మండలాఫీసుల్లో పెద్దగా వుండవు. అటెండరుగా చేరి మండలాలయిన తరువాత అతికష్టం మీద రికార్డసిస్టెంటయ్యాడు తను. ఆ వచ్చే జీతం లోనే భార్యాబిడ్డల్నీ, తల్లిదండ్రుల్నీ సాకుతూ నెట్టుకొచ్చాడు. ఎట్నో నాయిన తిరుగులాడ్తూ, తిరుగులాడ్తా వుండంగానే రెడ్డోళ్ళ చెరుకుతోట దారిన వస్తావుంటే పాము కరిచి చచ్చిపోయినాడు. జరిగేవన్నీ మనమంచికే అనుకున్నాడు మనోహరం.

అమ్మని ఆమాట ఈ మాటా చెప్పి తమ్ముడితో పంపించేసినాడు. పెద్దకొడలు వద్ద నుండి వెళ్లడానికి ఏమాత్రం యిష్టంలేక వెళ్తూ వెళ్తూ తల్లి చూసిన చూపుని మనసు చుట్టూ ఏర్పరుచున్న వలయం దాటి లోపలికి రానీయలేదు. అప్పటికే ఆ వలయం పటిష్టతను సంతరించేసుకుంది.

నాయిన పోయేనాటికి నేల అమ్ముకోలేదు. అప్పటికి ఒక్క పైసా అప్పులేదు. చిల్లికానీ చేతిలో లేదు. అవతలవతల ఎప్పుడు ఏం జరుగుతున్నది తెలీకుండా చాప కింద నీరులా జరిగిపోయింది. ఎప్పటికప్పుడు 'ఇదిగో ఈ ఒక్కసారికేలే... రేపు పంటొస్తానే యిచ్చేస్తే పోతాది' అంటూ అంచెలంచెలుగా అప్పు జమవుతూ వచ్చింది.

కొడుకు రవికి తాము జీవించే దుర్భరజీవితం పట్ల ఏవగింపు. చేతకాని తండ్రి మూలం గానే తమ జీవితాలీ విధంగా తయారయ్యాయని హేళన. తెలీని కసి, ఈ వూరికొస్తానే చదువు

మాన్పించి శెట్టంగట్లో పనికి కుదిర్చాడనీ, తండ్రి మీద రేగిన కోపంతో పాపం రవి మంచి అబ్బాయి కాబట్టి తండ్రిని ఏమీ అనలేక ఇల్లు వదిలి పారిపోయాడు.

అదీ ఒకందుకు మంచిదే. ఈ యిరుకు యింట్లో కన్నా సువిశాలమయిన ప్రపంచంలో జీవితాన్ని తెలుసుకోవడానికి ఎక్కువగా అవకాశాలుంటాయనీ... ఏదో ఒక నాటికి తన కొడుకు ప్రయోజకుడయి తిరిగి వస్తాడనీ గట్టి నమ్మకం మనోహరానికి.

భార్య ముక్కెగబీలుస్తూ ఛర్రు ఛర్రున బియ్యం చెరుగుతోన్న శబ్దంతో చప్పున ఈ లోకంలోకొచ్చి పడ్డాడు మనోహరం.

'మూసిన ముత్యం... పాసిన పగడం మాట్లాడితే యాడ ముత్యాలు రాలిపడిపోతాయో ఏరి మూటగట్టుకుంటామనుకుంటాడు... యాడా జూళ్ళేదమ్మా యిట్టాటి మొగుణ్ణి..." ఒక వంక బియ్యం చెర్గుగుతూనే సణుగుతోంది జానకి.

మనోహరానికి జానకిని చూస్తుంటే చెప్పలేనంత జాలివేసింది. తన నిస్సహాయత మీద కోపమూ కలిగింది. అవును తను వసంతకి జాబు వ్రాయలేదు. రూపాయి పెట్టి కవరు కొనలేక అన్నదొక్కటే సత్యంకాదు... ఒక్క రూపాయే అయితే అప్పు దొరక్కపోదు. ఆ రూపాయితో కవరు కొనేసి అందులో వ్రాయాల్సిన విషయాలు చాలా ధర పలుకుతాయి మరి. వెళ్ళి అమ్మాయిని తీసుకొస్తానని రాయాలి. తీసుకొచ్చి కానుపు చేయించాలి. పురుడు చేయాలి. తల్లీబిడ్డల్నీ మూడో నెలదాకా వుంచుకోవాలి. ఈలోపల అల్లుడు పదే పదే వచ్చిపోతాడు. అత్తా ఆడబిడ్డలూ వస్తారు. ఇదంతా ఒక్క రూపాయితో తేలేది కాదు. అందుకే జానకి మాట ఖాతరు చేయకుండా వాయిదా వేస్తూ వచ్చిందిన్నాళ్లూ

జానకి సన్నగా ఏడుస్తోంది.

గర్భవతి అయిన కూతుర్ని చూసుకోవాలని, దగ్గరుండి సేవలు చేయాలనీ ఆమెకు చాలా యిష్టంగా, ఆశగా వుంది. అదీకాక మనసు బలహీనపడినప్పుడల్లా కొడుకు ఎక్కడున్నాడో నన్న దిగులు అమెను చుట్టేస్తుంది. రెండూ కలిసి కలగాపులంగా ఆమె గుండెను బలంగా పిండేస్తున్నాయి.

"ఏడుపాపు..." గద్దించాడు మనోహరం. అతడు అప్పుడప్పుడూ తన నిస్సహాయతను పెత్తనం రూపంలో బహిర్గతం చేసి ఆమె నోరు మూయిస్తుంటాడు చాలా మంది మొగాళ్ళలాగే.

"ఎవరు చచ్చారనిప్పుడు...? రాస్తాన్లే... రేపు రాస్తానన్నాను కదా. నోరుమూసుకో" విరుచుకుపడ్డాడు.

గుడ్లలో నీటిని గుడ్లలోనే, గుండెల్లో బాధని గుండెల్లోనే అణిచేసుకుని చప్పున లేచి చేటతో లోపలికెళ్ళిపోయింది జానకి.

ఈసారి జానకిని చూస్తుంటే గుండె గొంతులో కొచ్చినట్లుగా అయింది మనోహరానికి. ఆ రాత్రి అభోజనంగా పడుకుని నిద్రలేమితో బాధపడ్తోన్న జానకిని ఓదార్చాలని ఎంతగానో అన్పించినా... చాల గట్టిగా బెట్టుగా వుండిపోయాడు మనోహరం. జానకిని దగ్గరికి తీసుకుని చనువిస్తే ఏమవుతుందో అతడికి బాగానే తెలుసు.

కరిగి నీరయి ఆ తడిలో మొదలయిన లేలేత నిష్ఠూరాలు తమ పెళ్ళయిన్నాటి నుండీ పడిన అష్టకష్టాల జాబితాతో సుదీర్ఘ రామాయణమై కొడుకు వెళ్ళిపోయిన్నాటి సంఘటనతో ముగుస్తుంది. ఇదే అవకాశంగా తన అసమర్ధతని ఆమె ఏకరువు పెడ్తుంటే వినడానికీ, ఒప్పుకోవడానికి సిద్ధంగా లేడు. అలాగని ఆమెని సంతోషపెట్టడం కోసం కూతుర్ని తీసుకొచ్చి లోకం కోసమే అయినా కానుపు చేయించడానికి సుముఖంగానూ లేడు. ఏం చేయాలో తెలీనితనంతో రాత్రిని తెల్లారిస్తూ వేకువన ఒక నిర్ణయానికి కొచ్చాడు మనోహరం... ఆ రోజు ఎలాగైనా కూతురుకి ఉత్తరం వ్రాయాలని.

ఈ మండలం చాలా పెద్దది. సీనియారిటీ ప్రకారం మరొకరికి రావాల్సిన ట్రాన్స్‌ఫర్ తనకి రావడంతో ఆ సదరు వ్యక్తి రిపోర్టు మేరకు తనని మళ్ళీ మరోచోటికి మారుస్తున్నారనీ, ఆ గొడవలో తిరుగుతూ తను కూతుర్ని తీసుకురాలేక పోతున్నాననీ, త్వరలోనే రావడానికి ప్రయత్నిస్తాననీ వ్రాసి పోస్ట్ చేయాలనుకున్నాడు. ఆ తరువాత అతడికి ప్రశాంతంగా నిద్ర పట్టేసింది.

ఆ మరునాటి సాయంత్రం...

మౌనంగా, అసలేమీ పట్టనట్లుగా టీ అందిస్తోన్న జానకిని చూసి చప్పున గుర్తొచ్చింది మనోహరానికి. ఆఫీసులో రద్దీగా వుండడంతో పూర్తిగా చదవకుండానే లోపల పేట్టేశాడు. కూతురి ఉత్తరం చూడగానే తను వ్రాయాలనుకున్న ఉత్తరాన్ని మళ్ళీ వాయిదా వేశాడతడు.

తాపీగా టీ త్రాగి కూతురి ఉత్తరం విప్పాడు.

'పూజ్యులు నాన్నకీ,

వసంత నమస్కరించి వ్రాయునది.. ఇక్కడంతా బాగానే వున్నారు. అక్కడెలా వున్నారని నేనడగను. ఎందుకంటే మీరెలా వున్నారో నాకు తెలుసు కాబట్టి. మొన్న డాక్టరమ్మకి చూపించు కుని వస్తుంటే సెంటర్లో రామచంద్ర మామ కన్పించి చెప్పాడు. 'అమ్మ నిండా తగ్గిపోయి నీర్సంగా వున్నాదని నాయిన ఎప్పటి మాదిర్నే ఎండుకుపోయి వుండాడనీ, తమ్ముణ్ణి చదువు మాన్పించి శెట్టంగట్లో పెట్టారనీ...' అన్ని విషయాలు చెప్పాడు.. నాన్న జాబు వ్రాయలేదని నేను బాధపడ్తోంటే సర్దిచెప్పాడు.

నాన్నా! కూతురు గర్భవతి అని తెలిస్తే కూడ సంతోషించడానికి డబ్బుతెర అడ్డ మొచ్చేస్తుంది నాన్నా, మధ్యతరగతి తల్లిదండ్రులకి. అయిదోనెలలో నన్ను సారె పెట్టి తీసికెళ్ళ లేదనీ, అచ్చటా, ముచ్చటా తీర్చలేదనీ మా అత్తగారు చాలా కోపంగా వుంది. ఆడబిడ్డకి నా పుట్టింటోళ్ళు ఏమీ జరపలేదనీ అన్నీ యిక్కడే జరిపించుకుంటున్నాదనీ ఎగతాళిగాను, కంట గింపుగానూ వుంది, నాన్నా నువ్వు నాకు లోకజ్ఞానం నేర్పితే, అమ్మ నాకు ఎంతో సహనాన్నిచ్చింది నాన్నా. అంతనిండు సహనమూ ఈ యింట్లో తేలిపోతోంది.

నాకు తెలుసు నాన్నా నువ్వేమంటావో. ఏం చేయనమ్మా నా జీతం అంతంత మాత్రమే అంటావు. పంట చూస్తుంటే వానాకాలం నీటి ముల్లు గుచ్చితే ఎండాకాలం కరెంటు పురుగు

తినేస్తోంది అంటావు. అవన్నీ వీళ్ళకెందుకు నాన్నా?... సారె పెట్టి పురుడు పోయాల్సిన బాధ్యత నీది. నువ్వు అప్పే చేస్తావో, అడివే నరుకుతావో వీళ్ళకనవసరం. నాన్నా... కన్నకూతురు గర్భవతి అయినపుడు ఎంతటి గడ్డుస్థితిలోనయినా తండ్రే కానుపు చేయించి తీరాలన్న గొప్ప సాంప్రదాయాన్ని యిప్పటికిప్పుడు నువ్వూ, నేనూ ఏం చేసి మార్చగలం నాన్నా? వెంటనే బయల్దేరి వచ్చి నన్ను తీసికెళ్ళాల్సింది.

నాన్నా ఎవరయినా చుట్టాలు మనింటికొస్తామని వ్రాసినపుడు నాకు ట్రాన్స్‌ఫర్ అవుతోం దనీ, నేనువుండననీ, రావొద్దనీ, ఏమీ అనుకోవద్దనీ వ్రాసేవాడివి ఖర్చులు తట్టుకోలేక. మొన్న అయిదో నెల్లో నువ్వు ట్రాన్స్‌ఫర్ సంగతి వ్రాసినపుడు నిజాన్ని నాలోనే మింగుకున్నాను. మరి యిప్పుడు కానుపు సమయంలో ఏసాకు చెప్పగలవు నాన్నా...?

మెత్తబడుతోన్న మనసు వలయాన్ని తిరిగి గట్టి పరచడం కోసం ముందరున్న జి.కె. పుస్తకం తీశాడు మనోహరం.

'ఈ జీవితం మనది... దీన్నుండి మనం పారిపోవడానికి ప్రయత్నిస్తాం... కానీ అది మనల్ని వదలదు... వ్యక్తి తన పుట్టుకనుండీ చివరి శ్వాస వరకూ అతని సంపూర్ణ క్రియలకు అతడి జీవితం సమాధానమవుతుంది... మరెందుకు మనం పారిపోవడానికి ప్రయత్నించడం?"

గట్టిగా చప్పుడయ్యేలా పుస్తకాన్ని మూసేశాడు మనోహరం.

ఆంధ్రజ్యోతి వారపత్రిక, 1997